క్లుప్తంగా

అంబులెన్సులో ప్రసవం

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన నిండు గర్భిణిని అంబులెన్స్‌లో జనగామ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. వివరాల ప్రకారం.. కొండగడప గ్రామానికి చెందిన తాటిపాముల మహేశ్వరి కి శుక్రవారం పురిటి నొప్పులు మొదలు కావడంతో 108లో జనగామ తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆడ పిల్లను ప్రసవించింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని, తదుపరి చికిత్స కోసం జనగామలోని మాతా శిశు కేంద్రానికి తరలించినట్లు దేవరుప్పల 108 ఈఎంటీ మల్లేష్, పైలట్ రాజు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 10,26 వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుందని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు నిర్మించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ కోరారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, బలరాం రెడ్డి, శేఖర్, ఎండీ అమనత్, రత్న రాజశేఖర్ మున్సిపల్ సిబ్బంది నర్సింగ్, శంకర్ పాల్గొన్నారు.

'జీవిత సత్యం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

భువనగిరి : పట్టణంలోని త్రిశక్తి గాయత్రి దేవాలయంలో దివ్యజ్ఞాన గురుజీ విఠలశర్మ రచించించిన జీవిత సత్యం పుస్తకాన్ని శుక్రవారం యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం అర్చకులు గౌరిబట్ల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రి చారిట్రబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం



గంధం ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, బూడిద భిక్షమయ్యగౌడ్

ఆలేరురూరల్ : ఆలేరులోని హజ్రత్ సయ్యద్ అహ్మద్ బదియొద్దీన్ పీర్ కుత్బుల్ జిందాషా మదార్ సాహెబ్ దర్గా ఉర్సు శుక్రవారం ప్రారంభమైంది. దర్గా నిర్వాహకుడు బీజిని మధు ఆధ్వర్యంలో గంధం ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మైనార్టీ నాయకులు



శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : భువనగిరి ఎమ్మెల్యేగా గెలిచిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు ఆయనకు పూలమాల వేసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహార్, నాయకులు అబేద్ అలీ, ఏజేజ్, బషీర్, షఫీక్ పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లాయిఖ్‌అహ్మద్ శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, బబ్బు, నయీం, జాకెర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని బోగారం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు తెలుసూరి శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం మృతుడి కుటుంబాన్ని సర్పంచ్ అంతటి పద్మారమేష్ పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోగు పద్మాసత్తయ్య, ఉపసర్పంచ్ జెల్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అయ్యప్పరెడ్డి, గోగు వెంకటరమణ, గుంజె గణేష్, లక్ష్మీనారాయణ, నీరజవెంకటరమణ, గోగు మహేష్ పాల్గొన్నారు.

మల్లగూడెంకు రహదారి కష్టాలు

- గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు
- కాశగూడెం – మల్లగూడెంకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా పూర్తి కాని పనులు
- బస్సులు, ఆటోలు రాలేని పరిస్థితి



మల్లగూడెంకు వెళ్లే మట్టి రోడ్డు



కంకర వేసి వదిలేసిన కాశగూడెం - మల్లగూడెం రోడ్డు

రాజాపేట : ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామాల స్థితిగతులు మారడం లేదు. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం బాగుండాలి. కానీ నేటికీ కొన్ని గ్రామాలకు రహదారులు సరిగా లేకపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటున్నాయి. మండలంలోని మధిర గ్రామం మల్లగూడెంకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి ఆరు కిలో మీటర్లు ఉండగా సరైన రోడ్డు మార్గం లేక నేటికీ బస్సులు, ఆటోలు గ్రామానికి రావడం లేదు. గ్రామస్తులు ద్విచక్ర వాహనాలు, కాలినడకనే మండల కేంద్రానికి చేరుకుంటున్నారు.

గ్రామానికి రెండు దారులు..

మల్లగూడెం గ్రామానికి వెళ్లేందుకు రెండువైపులా దారులు ఉన్నాయి. ఒకటి కాశగూడెం నుంచి ఉండగా పుట్టగూడెం నుంచి మరో దారి ఉంది. పుట్టగూడెం నుంచి మల్లగూడెంకు ఉన్న రోడ్డు మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురమయంగా మారి గుంతలు పడి ప్రయాణం చేయడానికి నరకయాతన పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

నిధులు మంజూరైనా..

కాశగూడెం నుంచి మల్లగూడెంకు మూడు కిలోమీటర్లు ఉన్న మరో దారి ఉంది. ఇందులో రెండు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డుగా నిర్మించేందుకు రూ.కోటి 20లక్షలు మంజూరయ్యాయి. కాగా ఈ రోడ్డులో కంకర పరిచి మధ్యలోనే వదిలేశారు. దీంతో కంకర రోడ్డుపై నిత్యం ప్రయాణించాలంటేనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఉన్న రెండు దారుల్లో రోడ్డు మార్గం సరిగా లేక బస్సులు, ఆటోలు, అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్‌లు సైతం రాలేని దుస్థితి నెలకొంది. నిత్యావసరాల సరుకులు, ఎరువులు, విత్తనాలు, పింఛన్లు, రేషన్ సరుకుల కోసం అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నిత్యం గ్రామ ప్రజలంతా పుట్టగూడెం గ్రామం మీదుగా సమీపంలోని జగదేవపూర్ మార్కెట్‌కు వెళ్తుంటారు. ఈ దారంతా మట్టి రోడ్డు కావడంతో వర్షం వస్తే నడవలేని పరిస్థితి ఉంది. మా గ్రామానికి సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– లక్ష్మణ్, మల్లగూడెం

బస్సులు, ఆటోలు రావు



మా గ్రామానికి వచ్చే రోడ్డు వర్షం పడితే చాలు చిత్తడిగా మారుతాయి. రాత్రివేళల్లో అత్యవసర పరిస్థితుల్లో 108 రావాలన్నా ఇబ్బందే. రోడ్డు సరిగా లేక గ్రామానికి బస్సులు, ఆటోలు రావడం లేదు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. రేషన్ సరుకులు, ఆసరా పింఛన్ల కోసం పాముకుంటకు వెళ్లాలన్నా నరకయాతన పడాల్సి వస్తోంది.

– గొడుగు రాజు, సర్పంచ్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



రామన్నపేట : ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

రామన్నపేట : మండలంలోని ఉత్తటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన హరిహరపుత్ర అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల స్వామి, మాజీసర్పంచ్‌లు మంచిరాజు శరత్‌చందర్, జెట్టి బాలమల్లయ్య, పాసుగోటి వెంకటేశ్వర్‌రావు, ఎడవల్లి దుర్గాప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలింగేశ్వర ఆలయంలో..

వలిగొండ : మండలంలోని ఆరూర్ గ్రామంలో బద్ద రామకృష్ణా రెడ్డి కాలనీలో నిర్మించిన శ్రీ మహాలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహ విగ్రహాలను సిద్ధాంత కళాప్రపూర్ణ బేతోజు సత్యనారాయణ శాస్త్రి బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. అంతకుముందు గణపతి పూజా, మోహినీ క్షేత్ర పాలకులకు వాస్తు పూజా, మండల పూజలు, జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బద్ద చంద్ర శేఖర్ రెడ్డి, పెద్దిటి సత్తిరెడ్డి, బద్దం చేతన్ రెడ్డి, చందన్ రెడ్డి,రవీందర్ రెడ్డి, భూషి రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

రాచకాల్వలో రైతుల శ్రమదానం

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వ నుంచి నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు సమీపంలో జాలకుంటవాగు వద్ద వృథాగా పోతున్న వరద నీటిని గురుజాల, రామగిరి, శాలిలింగోటం గ్రామాలకు చెందిన సుమారు 30 మంది రైతులు శుక్రవారం శ్రమదానం చేసి అరికట్టారు. రామగిరి గ్రామానికి చెందిన చామల వెంకటరమణారెడ్డి, నీటిపారుదలశాఖ ఏఈ రాములు నేతృత్వంలో ఆయా గ్రామాల రైతులు శ్రమదానం చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చేందుకు యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదిపై అడ్డంగా ఆనకట్ట నిర్మించడంతోపాటూ హెడ్‌రెగ్యులేటర్‌ను కూడా నిర్మించారు. ఈ హెడ్ రెగ్యులేటర్ నుంచి సుమారు 30 కిలోమీటర్లు రాచకాల్వ నిర్మించారు. ఈ రాచకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. రాచకాల్వలో చెత్తచెదారం తొలగింపు దాదాపు పూర్తికావడంతో ప్రస్తుతం మూసీనదిలోకి ప్రవహిస్తున్న వరదనీటిని హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి మళ్లించారు. ఈనేపథ్యంలో జాలకుంటవాగు వద్ద ధ్వంసమైన షట్టర్ల ద్వారా వృథాగా పోతున్న వరద నీటిని ఇసుక బస్తాలు అడ్డుగా వేసి వరద నీరు వచ్చేలా పాటుపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులు ననుబోతు అంజయ్య, శ్రీను, ఆకుల యాదయ్య, మాద నర్సింహ, దీటి కుమార్, వేముల నాగరాజు, గణేశ్, నిమ్మల రవి, సర్వయ్య, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వలిగొండ : మండలంలోని సుంకిశాలలోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విష్వక్సేన, పుణ్యాహవచనం, రుత్విక్కరణం, రక్షా బంధనం, అంకురార్పణ, నివేదన తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 10న స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేంకటేశ్వర స్వామి ఆలయ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాయాగం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామానంద ప్రభుజీ

బొమ్మలరామారం : మండలంలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలో గల శ్రీ సాయిధామం ఆశ్రమంలో దత్తాత్రేయ జయంతి సందర్భంగా ఈ నెల 26న నిర్వహించనున్న శ్రీ దత్త మహాయాగం వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభుజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహా యాగం లోక కళ్యాణం కోసం అత్యంత భక్తి శ్రద్ధలతో 108 యజ్ఞ కుండములతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు యాగంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు చంద్రారెడ్డి, సాయి గీత, పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతి, ఉపాధ్యాయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎల్ఈడీ టీవీ బహూకరణ



టీవీని బహూకరిస్తున్న విజయదత్తాత్రి

భువనగిరి రూరల్ :మండలంలోని బండ సోమారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు దత్తాత్రేయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గుండేటి విజయ దత్తాత్రి శుక్రవారం ఎల్ఈడీ టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నానం పద్మ కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ యాట రమేష్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మచ్చ ఆంజనేయులు ఎస్ఎంఎస్ చైర్మన్ రామకృష్ణ, మజ్జిగ కుమార్, ఎర్రం నర్సయ్య, చెరుకూరి గౌరయ్య, దసరాపు నర్సింహా, వెంకటేష్, మోక్ష , రఘు,భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం

చౌటుప్పల్ : నియంతపాలన నుంచి తెలంగాణ ప్ర జలకు విముక్తి లభించిందని.. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ అన్నారు. పట్టణ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో ప్రతి ఇంట్లో వెలుగులు నిండుతాయన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల నాయకత్వంలో ఉమ్మడి జిల్లా వేగంగా అభివృద్ధి జరుగుతందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో గో శిక రవీందర్, తడక అమర్, ఎండీ.అబ్దుల్‌రహీం, ప బ్బు శ్రీకాంత్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే ప్రజా భవన్‌గా మార్చడం హర్షణీయం

మర్రిగూడ : ప్రగతి భవన్ పేరును నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌గా మార్చడం హర్షణీయమని బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పగిళ్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టోలోని అంశాలను తూచా తప్పకుండా ఆచరించి న్యాయం చేయాలని కోరారు. ప్రజా రంజక పాలన సాగించాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్, ఐతగోని సురేష్, పగిళ్ల వెంకటేష్, బేత శంకర్, సిలివేరు వెంకటేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు



రామన్నపేట : వెల్లంకి శివాలయంలో సామూహిక వ్రత పూజలో పాల్గొన్న భక్తులు



శ్రీ చెన్నకేశవ ఆలయంలో..



మునిపంపుల శివాలయంలో కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు

రామన్నపేట : మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం, వెల్లంకి శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయ పూజారులు పందిళ్ల విద్యాసాగరశర్మ, గోపిచార్యులు ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, అష్టాదిక్పాలక పూజల అనంతరం శ్రీ సత్యనారాయణస్వామి ప్రతిమకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెల్లంకిలో పార్వతీదేవికి అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్లు వనం సత్తయ్య, లవనం ఉపేందర్, కనుతాల శశిధర్‌రెడ్డి, కొంపల్లి విజయానందం, ఠాగూర్‌బలరాంసింగ్, తాటిపాముల స్వామి, మదూరి నర్సింహారావు, వనం ఉపేందర్, మిర్యాల సత్తయ్య, తాటి వీరస్వామి, రావిటి రమేష్ పాల్గొన్నారు.

మునిపంపుల శివాలయంలో ..

మండలంలోని మునిపంపుల శివాలయంలో శుక్రవారం కార్తీకమాసం చివరి ఏకాదశిని పురస్కరించుకుని సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసశర్మ, మాజీసర్పంచ్ కట్ట యాదయ్య, మన్నె పద్మారెడ్డి, చొల్లేటి ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దోటి మంజుల

సంస్థాన్ నారాయణపురం: గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నానని సర్పంచ్ దోటి మంజుల అన్నారు. మండలంలోని చిల్లాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగపల్లి రవీందర్, దుబ్బాక అనిత, అనిల్, సత్తమ్మ, నర్సింహ, మంగమ్మ, రాజు, ఇందిరమ్మ, గఫూర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి

రామన్నపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనకాలంలో అమలు చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదర్శ రైతు సంఘం మండల అధ్యక్షుడు బూరుగు వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ అధికారులకు ఆదర్శ రైతులు సంధాన కర్తలుగా వ్యవహరించి పంటల నమోదు, భూసార పరీక్షలు, ఎరువులు, విత్తనాల పంపిణీలో క్రియాశీలకంగా వ్యవహరించి రైతులకు ఆసరాగా నిలిచారన్నారు. ఆయన వెంట నోముల దశరథ, బుద్ధ రాములు, ఆముద లక్ష్మన్, నక్క రాంనర్సయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసిన సీఐ, ఎస్ఐలు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐలు

యాదగిరిగుట్ట: ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల అయిలయ్యను శుక్రవారం రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సైలు రాఘవేందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, తేజంరెడ్డి, యాకన్న, వెంకటశ్రీనులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలేరురూరల్ : బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు పేరపు సిద్ధలు, వట్టిపలి సిద్దిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, సతీష్, కర్నాకర్, రాజు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసిన నాయకులు

అడ్డగూడూరు : మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు ఇటికాల చిరంజీవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ కొప్పుల నిరంజన్, పాశం సత్యనారాయణ, పల్రెపాటి యుగేంధర్, బాలెంల సైదులు, నాగరాజు, వంశీ, విజయ్ పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేలకు సన్మానం



రామన్నపేట : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట : మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నార్మాక్ డైరెక్టర్ మందడి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జినుకల ప్రభాకర్, సర్పంచ్‌లఫోరం అధ్యక్షుడు గుత్తా నర్సింహారెడ్డి, మందడి రవీందర్‌రెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, పున్న రమేష్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, అప్పం రామేశ్వరం, పిట్ట వెంకట్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలను శుక్రవారం జెడ్పీటీసీ వాకిటి పద్మా అనంత రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

మందుల సామేల్‌కు శుభాకాంక్షలు

మోత్కూరు : తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన మందుల సామేల్‌ను శుక్రవారం మోత్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత



వీల్ చైర్ అందజేస్తున్న కడియం రామచంద్రయ్య

మోత్కూరు : మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పొన్నబోయిన కృష్ణవేణికి శుక్రవారం కడియం సోమక్క చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ట్రస్ట్ ఫౌండర్ కడియం రామచంద్రయ్య వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్, ట్రస్టు చైర్మన్ కడియం కళ్యాణ్‌చందర్, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సాయిరామ్



భువనగిరి : ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బానోత్ సాయిరామ్ నియమితులయ్యారు. ఢిల్లీలో జరుగుతున్న ఏబీ వీపీ 69వ జాతీయ మహా సభ, 42వ తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానరెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి జూడో క్యాంప్‌కు ఎంపిక

బీబీనగర్: మండల కేంద్రంలోని మాంటిస్సోరీ పాఠశాలకు చెందిన విద్యార్థి రతన్‌సింగ్ జాతీయ స్థాయి జూడో పోటీల క్యాంప్‌నకు ఎంపికైనట్లు కోచ్ సర్వేజ్ శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఇటీవల కేరళలో నిర్వహించిన జూనియర్ జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు క్యాంప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. క్యాంప్‌కు ఎంపికైన రతన్‌సింగ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

- ఏడేళ్ల క్రితం మండలంగా ఏర్పాటు
- నేటికీ సొంత భవనాలు కరువు
- రవాణా సౌకర్యం అంతంత మాత్రమే..
- నూతన ప్రభుత్వంపై ఆశలు



అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్



షెడ్యూలు కులాల బాలుర వసతి గృహంలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

మోటకొండూర్ : ప్రజలకు పాలన చేరువ చేయాలన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల పునర్విభజన చేపట్టింది. అందులో భాగంగా ఏడేళ్ల క్రితం యాదగిరిగుట్ట, ఆలేరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలతో మోటకొండూర్ మండలాన్ని ఏర్పాటు చేసింది. కాగా నూతన మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు పక్కా భవనాలకు నోచుకోవడం లేదు. అద్దె భవనాలు, అరకొర సౌకర్యాల నడుమ పాలన సాగిస్తున్నారు. పక్కా భవనాలకు స్థల సేకరణ కూడా చేయలేదు. అంతేకాకుండా మండల కేంద్రానికి రవాణా సౌకర్యం సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను నియమించకపోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశతో ప్రజలు ఉన్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



విధులకు సంబంధించిన సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనడానికి మండల కేంద్రం వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నాం. ముత్తిరెడ్డిగూడెం నుండి మోటకొండూర్ రావటానికి రవాణా సదుపాయం లేదు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. రవాణా సదుపాయం కల్పించాలి.

– పద్మ, అంగన్‌వాడీ టీచర్, ముత్తిరెడ్డిగూడెం

వసతులు కల్పించాలి



మండలం ఏర్పాటు చేసి ఏడేళ్లయినా రోడ్డు, రవాణా సౌకర్యం సరిగా లేదు. ప్రభుత్వ శాఖలకు పక్కా భవనాలు లేవు. పూర్తి స్థాయి అధికారులు లేరు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ప్రజలకు పాలన చేరువ చేయాలని కోరుతున్నాం.

– బొలగాని జయరాములుగౌడ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు